ఖరీఫ్ సాగు.. అంతంతే

- కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం
- ఆందోళనలో అన్నదాతలు


తాడిపత్రి సమీపంలో సాగైన పత్తి పంట

తాడిపత్రి రూరల్: తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు గణనీయంగా తగ్గింది. రైతులు ప్రధానంగా వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, కంది, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కొందరు రైతులు అరకొర వర్షాలకే సాగు చేశారు. మిగిలిన రైతులు వర్షం కోసం ఎదురు చూడటంతోనే ఖరీఫ్ ముగిసింది. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించలేదు. పెట్టుబడి సాయం కోసం రైతులు పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదు. పెట్టుబడి కోసం రైతులు పలు చోట్ల తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. కొత్తగా అప్పులు పుట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెట్టుబడిసాయాన్ని సకాలంలో ఇవ్వడంతోపాటు రైతులకు అండగా నిలవడంతో పంటలను సాగు చేసేవారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడటంతో వైఫల్యం చెందింది.

కనుమరుగవుతున్న వేరుశనగ..

తాడిపత్రి ప్రాంతంలో ఒకప్పుడు వేరుశనగతో పంటలు పచ్చగా ఉండేవి. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా వేరుశనగను సాగు చేసేవారు. వర్షాభావం, పెరిగిన పెట్టుబడి, కొరవడిన ప్రభుత్వ సాయం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, అరకొర దిగుబడులతో రైతులు అప్పుల పాలయ్యారు. ఏటా నష్టాలు రావపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చలేక కొత్తగా పెట్టుబడి పెట్టలేక రైతులు వేరుశనగను సాగు చేయడం లేదు.

పత్తి రైతుకు దగా..

తాడిపత్రి ప్రాంతంలో విస్తరంగా పత్తి పంటను సాగు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి పత్తి రైతులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం కొలువయ్యాక పత్తికి ధరలు పడిపోయాయి. గిట్టుబాటు ధర కూడా రైతులు ఆశించినంత లేదు. పత్తి పంట సాగు ఖర్చుతో కూడుకున్నదిగా మారింది. పంటకు సోకిన తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ పేరుతో రూ.వేలు ఖర్చుచేయాల్సి వస్తోంది. పంట దిగుబడి కూడా తగ్గుతుండటంతో ఈ ఏడాది పంట సాగు తగ్గింది.

తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇలా..

పంట	సాధారణ సాగు (ఎకరాల్లో)	సాగైంది (ఎకరాల్లో)
వేరుశనగ	5,309	2,073
కంది	3,565	1,706
వరి	1,478	729
మొక్కజొన్న	5634	3,802
పత్తి	5,735	2,652
పొద్దుతిరుగుడు	477	3

వర్షాభావంతో సాగు తగ్గింది



తాడిపత్రి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు వర్షాభావ పరిస్థితులే కారణం. పంటల సాగు కోసం రైతులు దుక్కులు దున్ని వర్షాల కోసం ఎదురు చూశారు. అరకొరగా పడిన వర్షాల వల్ల రైతులు పంటలను సాగు చేయలేదు. రైతులకు అవసరమైన విత్తనాలను రాయితీగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా వర్షాలు లేక రైతులు కొనుగోలుకు ముందుకు రాలేదు. – రవి, ఏడీఏ, తాడిపత్రి


మొక్కజొన్నకు నకిలీ పోటు..

తాడిపత్రి ప్రాంతంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. మొక్కజొన్న విత్తనాలకు నకిలీల చీడ పట్టింది. తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో దళారుల నుంచి రైతులు విత్తనాలను కొనుగోలు చేసి దిగుబడి రాక నష్టపోతున్నారు. అరకొర దిగుబడి వల్ల పంటకు పెట్టిన పెట్టుబడి రావడం లేదు. కొన్ని రోజుల క్రితం తాడిపత్రి పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులో కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తనాలు నకిలీ కావడంతో పంట దెబ్బతినిందని రైతులు దుకాణం వద్ద ఆందోళనకు సైతం దిగారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందలేదని అన్నదాతలు వాపోయారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గుత్తి: పట్టణంలోని 11వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి పాల్గొన్నారు.

అంజలి నగర్‌లో శ్రమదానం


పార్క్‌లో చెత్తాచెదారం తొలగిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అంజలినగర్‌లో ఉన్న ఏపీజే అబ్దుల్ కలామ్ పార్క్‌లో సఫాయి మిత్ర.. సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ నయీమ్ అహ్మద్, కౌన్సిలర్ మెహరున్నీసా, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, శానిటేషన్ సెక్రటరీలు పార్క్‌లో పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాడికి: మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ కార్యాలయంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60మందికి వైద్యులు శివ, ఉమా, రోషిణి వైద్య పరీక్షలు చేసి, 30మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ శెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

యాడికి: మండలంలోని రాయలచెరువు సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. కొంత కాలంగా ఆధార్ కార్డు అప్డేట్ కోసం రాయలచెరువు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ తాడిపత్రి, అనంతపురం వెళ్లేవారు. రాయలచెరువులో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మే ఐ హెల్ప్ యూ' ఔదార్యం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో నెల రోజులుగా ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ లింగమ్ నాగేష్ (65) శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలుండగా.. విషయాన్ని యాడికి మండలం మే ఐ హెల్ప్‌యూ సభ్యులకు తెలిపారు. సభ్యులు ధ్రువనారాయణ, నాగేష్, బండారు బాలక్రిష్ణ, చింతా నరసింహ, శంకరప్ప, బోయ అశోక్ , టి.లక్ష్మీకాంతమ్మ తదితరులు అంత్యక్రియలను నిర్వహించారు. వారి సేవానిరతిని గ్రామస్తులు కొనియాడారు.

'ఈ-క్రాప్ బుకింగ్'లో అధికారుల విఫలం

గార్లదిన్నె: ఈ క్రాప్ నమోదు చేయడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనాథ్ చౌదరి మండిపడ్డారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రైతులకు యూరియా అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాముడు, సహాయ కార్యదర్శి వన్నూర్‌స్వామి, రైతు సంఘం నాయకులు క్రిష్ణ, నల్లప్ప, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు అనిల్

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు గ్రామానికి చెందిన కట్టెల సుంకన్న, పెద్దక్క దంపతుల కుమారుడు అనిల్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. 15 ఏళ్ల క్రితం తండ్రి చనిపోయాడు. అప్పటి నుంచి తల్లితో పాటు కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయాలంటూ బుధవారం రాత్రి తల్లి మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనిల్.. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో పురుగుల మందు సేవించి ఇంటికి చేరుకున్నాడు. గుర్తించిన తల్లి వెంటనే బంధువుల సాయంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకువచ్చింది. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలకృష్ణను మెంటల్ ఆస్పత్రిలో చేర్పించాలి


గుత్తిలో మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు


శింగనమలలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎన్‌వి నారాయణ

గుత్తి: మతిభ్రమించి అసెంబ్లీలో ఇష్టానుసారం మాట్లాడిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను వెంటనే హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు డిమాండ్ చేశారు. గుత్తిలో శుక్రవారం ఆయన పాస్టర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో హీరో చిరంజీవి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గతంలో బాలకృష్ణ ఓ నిర్మాతను గన్‌తో కాల్చి చంపడానికి ప్రయత్నించారన్నారు. ఆ కేసులో తప్పించుకోవడానికి ఆయన మెంటల్ సర్టిఫికెట్ తీసుకున్నారన్నారు. స్టేజీలపై కూడా బాలకృష్ణ ఇష్టానుసారం మాట్లాడతారన్నారు. చివరకు అభిమానులను కూడా కొట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు వాసుఅనిల్ కాంత్, అబ్రహాం, జాకోబు, సాల్మన్ రాజ్, నరేష్,అహరోను, బన్నీ, శీనా తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మానసిక రోగిగా బతుకుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణకు హీరో చిరంజీవిని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.వి. నారాయణ అన్నారు. శుక్రవారం శింగనమలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ తన ఇంట్లో ఓ నిర్మాతపై కాల్పులు జరిపి, ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి మానసిక రోగిగా సర్టిఫికెట్ పొందారని గుర్తుచేశారు. మీరు సైకోలు కాబట్టే ఇతరులను విమర్శిస్తున్నారన్నారు. అన్న చిరంజీవిని దూషించినా పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. లేకుంటే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జెల్లి శ్రీనివాసులు, అబ్దుల్, రాముడు, మసూద్ పాల్గొన్నారు.

బాలకృష్ణా.. నోరు అదుపులో పెట్టుకో


గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో హీరో చిరంజీవి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బాలక్రిష్ణ మానసిక రోగి అని అధికారంగా సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి అందరికీ తెలుసన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

ఆలయాభివృద్ధికి దాత అంగీకారం


దాత రాజేందర్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ, సిబ్బంది

గుంతకల్లు రూరల్: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో రూ.2.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దాత అంగీకారం తెలిపినట్లు ఆలయ ఈఓ ఎం.విజయరాజు తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ఆలయ గర్భాలయం, విమాన గోపురం, ముఖమండపాలు రాతితో నిర్మించుట తదితర పనుల నిర్వహణకు రాయచూరు పట్టణానికి చెందిన భక్తుడు నవోదయ విద్యాసంస్థల అధినేత, తెలంగాణ రాష్ట్రం నారాయణఖేడ్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు రాజేందర్ రెడ్డి ముందుకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఈఓతోపాటు ఏఈఓ వెంకటేశ్వరుడు, ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు, ఇతర అర్చక బృందం ఆధ్వర్యంలో దాతకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

చెత్త సేకరణపై అవగాహన

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని బొందలవాడలో శుక్రవారం పారిశుద్ధ్యం, తడి,పొడి చెత్త సేకరణపై కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్ గంగిరెడ్డి, షాకీర్ పాల్గొన్నారు.

'సొంత పార్టీ వాళ్లే నాపై కేసులు పెట్టించారు'

గుంతకల్లుటౌన్: సొంత పార్టీ నాయకులే తనపై కేసు పెట్టించారని బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన పాతగుంతకల్లులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వాసవి అమ్మవారి ఫొటో కనపడకుండా కమర్షియల్ అడ్వర్టైజ్‌మెంట్లతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బీజేవైఎం కార్యకర్తలు తొలగించిన విషయంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజాయిషీ కోరకుండా, షోకాజ్ నోటీసులివ్వకుండా తనకు, తన మిత్ర బృందానికి పార్టీతో సంబంధం లేదని పత్రికా ప్రకటన ఇవ్వడం బాధాకరమన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే బీజేపీకి చెందిన నాయకులే తనపై కేసు పెట్టించారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాను బీజేపీ కార్యకర్తగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మాజీ నాయకులు కేశవ, చక్రపాణి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందికి చీరల పంపిణీ

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సీ రాజగోపాల్ సౌజన్యంతో శుక్రవారం దసరా పండుగను పురస్కరించుకుని మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

శింగనమల(నార్పల): నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ(52) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగుళూరులో చికిత్స పొందుతుండగా శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. వారం క్రితం ఆయన బైక్‌లో వస్తుండగా కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు అతడిని బెంగుళూరుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై నార్పల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. మల్లికార్జున గురువారం అర్ధరాత్రి మూత్ర విసర్జనకు ఇంటి బయటకు వెళ్లాడు. చీకటి పామును తొక్కడంతో కాటు వేసింది. వెంటనే కుటుంబసభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహాలక్ష్మీ నమోనమామి..

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఐదోరోజు ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు వివిధ రూపాల్లో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గజలక్ష్మి అలంకరణలో ఉన్న యాడికి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


గుంతకల్లులో కొల్హాపురిగా వాసవీ మాత


గుంతకల్లులో మహాలక్ష్మిగా మారెమ్మదేవి


నార్పలలో మహాలక్ష్మిగా దుర్గాదేవి


పెద్దవడుగూరులో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు


కల్లూరులో కొల్హాపూర్ మహాలక్ష్మిగా అమ్మవారు


బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్కందమాతగా..


బీకేఎస్‌లో మహాలక్ష్మిగా ముసలమ్మ తల్లి


గుత్తిలో అన్నపూర్ణదేవిగా వాసవీమాత


సేవాఘడ్‌లో మహాలక్ష్మీ దేవిగా మాతా జగదాంబ


పామిడిలో లలిత త్రిపుర సుందరీదేవిగా వాసవీమాత

కమిషనర్ తీరుపై వైఎస్సార్‌సీపీ నేతల నిరసన


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకులకు సర్దిచెబుతున్న సీఐలు

గుంతకల్లుటౌన్: ఏదైనా సమస్య తలెత్తితే సామరస్యంగా పరిష్కరించాల్సిన మున్సిపల్ కమిషనర్.. రాజకీయ పార్టీల మధ్య చిచ్చుపెట్టేలా వ్యాఖ్యానించడం సరికాదని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు వీరేష్ అన్నారు. పురప్రజలకు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకులు ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీని కమిషనర్ నయీమ్‌అహ్మద్ తీసివేయించారు. ఈ విషయమై శుక్రవారం ఆ పార్టీ ఎస్సీసెల్ నాయకులు కమిషనర్‌ను కలిసి ఫ్లెక్సీని ఎందుకు తొలగించారని అడిగారు. తాను ఇరు పార్టీల ఫ్లెక్సీలు తీయించానని.. మళ్లీ టీడీపీ ఫ్లెక్సీ ఎవరు వేశారో తెలియదని చెబుతూనే.. 'మాకు ఒత్తిళ్లుంటాయి..మీ రాజకీయాలు ఇక్కడ చేయకుండా బయటకెళ్లి కొట్టుకోవాలి' అంటూ కమిషనర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. కమిషనర్ వైఖరిని నిరసిస్తూ ఎస్సీ సెల్ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్ నిరసనకారులకు సర్దిచెప్పారు. చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపచేయాలని, అధికార పార్టీకి కొమ్ముకాయడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎం.నల్లప్ప, కార్యదర్శి జెన్నేమస్తాన్, రాజశేఖర్, ఎస్టీసెల్, యువజన విభాగాల అధ్యక్షులు కొనకొండ్ల అంజి, అబ్దుల్‌బాసిద్ తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో అక్కా చెల్లెలు ప్రతిభ



వర్షిత, ఇంద్రలేఖ

గుంతకల్లు రూరల్: జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని నక్కనదొడ్డి గ్రామానికి చెందిన అక్కా చెల్లెలు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. నక్కనదొడ్డి గ్రామానికి చెందిన పార్థసారధి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కూతురు ఇంద్రలేఖ గుంతకల్లు పట్టణంలోని శంకరానంద కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, చిన్న కూతురు వర్షిత నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్నారు. వర్షిత అండర్- 16 విభాగం 60 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలవడమే కాకుండా, 600 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచింది. ఇంద్రలేఖ 60 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచింది. ఈనెల 26 నుంచి 29 వరకూ గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో మార్నింగ్ వాకర్స్ అసోషియేషన్‌తోపాటు పలువురు విద్యార్థులను అభినందించారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- గ్రామీణుల అవస్థలపై నోరుమెదపరా?
- నేడు మండల సర్వసభ్య సమావేశం


యల్లనూరులో శివాలయం వద్ద నిల్వ ఉన్న వర్షపు నీరు


జెడ్పీ హైస్కూల్ ఎదుట ఇలా..

యల్లనూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోయాయి. శనివారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో అయినా తమ సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పాలని మండలవాసులు కోరుతున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రత, ఎక్కడ చెత్త అక్కడే, వర్షపు నీరు నిల్వలతో దోమలు వ్యాప్తి....రోగాల బారిన పడి జనాలు గగ్గోలు పెడుతున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్లపైకి నీరు చేరుతున్నా అధికారుల్లో చలనం లేదు. అలాగే సాగు చేసిన పంటలకు తెగుళ్ల సోకి రైతులు సతమతమౌతున్నారు. తాగునీటి సమస్యతో గ్రామాలు విలవిలలాడుతున్నాయి. వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో జలుబు, దగ్గు అంటే తాడిపత్రి ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. యల్లనూరు పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ వైద్యం తూతూమంత్రంగా అందుతోందని రోగులు వాపోతున్నారు. తాడిపత్రి- సింహాద్రిపురం వరకూ గత కొన్నేళ్లుగా రాత్రిపూట సర్వీసు తిరుగుతున్న ఆర్టీసీ బస్సును అధికారులు రద్దు చేశారు. సమస్యలపై ప్రజలు, రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలంలో 14 సచివాలయాల ఉద్యోగులు ఎప్పుడు వస్తున్నారో...ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. పర్యవేక్షించాల్సిన ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ(ఈఓఆర్డీ)లు చోద్యం చూస్తున్నారు.